సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



లాభాలు బాగు

మునగ సాగుకు రాష్ట్రంలోని నేలలు అనుకూలం.ఆశించిన దిగుబడులతో పాటు లాభాలు ఆర్జించవచ్చు. 8లో▸



తెల్లరేషన్ కార్డు దారులకే..

తెల్లరేషన్ కార్డు దారులకే ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించాలని డీఎస్‌పీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. 8లో▸



శంకర్‌పల్లిలో రష్మి సందడి

ప్రముఖ యాంకర్, నటి రష్మి సోమవారం కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. 8లో▸

న్యూస్‌రీల్

22న యువజనోత్సవాలకు కళాకారుల ఎంపిక

హుడాకాంప్లెక్స్: 27వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు–2024 నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు యువకళాకారులను ఎంపిక చేస్తామన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సున్న వారు అర్హులని చెప్పారు. జానపద సంగీతం(గ్రూప్/సోలో), జానపద నృత్యం(గ్రూప్/సోలో), కథా–రచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వం, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో ఎంపికలుంటాయని వివరించారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఎంపికైన కళాకారులను రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు పంపిస్తామని, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన కళాకారులు జనవరి 24న నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని చెప్పారు.

‘రైతుబంధు’కు తప్పని నిరీక్షణ

రూ.378.92 కోట్లగాను
రూ.17.11కోట్లు జమ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుబంధు డబ్బుల కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా 4,04,436 మంది రైతులు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసుకుని ఉన్నారు. వీరి ఖాతాల్లో రూ.378.92 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఈ పంటసాయంపై పలు ఆంక్షలు విధించింది. తొలుత ఎకరం లోపు ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఎకరం లోపు ఉన్న 1.33లక్షల మంది రైతులను గుర్తించి, వారి వివరాలను ట్రెజరీకి పంపింది. అయితే వీరిలో ఇప్పటి వరకు 87,727 మంది రైతుల ఖాతాల్లో రూ.17.11 కోట్లు మాత్రమే జమ చేసింది. మిగిలిన రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అసలు పంట సాయం అందుతుందా? లేదా అనే ఆందోళన వ్యక్తమవుతుంది.

నేడు హెచ్‌పీఎస్‌కు రాష్ట్రపతి రాక

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం సందర్శించనున్నారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను ఆమె ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రాష్ట్రపతి వెళ్లే మార్గంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నారు. జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను నిలుపుదల చేయడం గానీ, మళ్లించడం గానీ చేయనున్నారు.

బిగ్‌బాస్ సీజన్–7 విజేతపై క్రిమినల్ కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: బిగ్‌బాస్ సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో హీరో నాగార్జున బిగ్‌బాస్–7 విజేతగా పల్లవి ప్రశాంత్‌ను ప్రకటించారు. అప్పటికే రన్నరప్ అమర్‌దీప్ అభిమానులు పెద్ద సంఖ్యలో స్టూడియో బయట వేచి ఉన్నారు. వారికి తోడుగా పలువురు కంటెస్టెంట్ల అభిమానులు అక్కడికి చేరుకుని నినాదాలు చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పల్లవి ప్రశాంత్‌ను రెండో గేటు నుంచి జూబ్లీహిల్స్ ఎస్‌ఐ రాకేష్, సిబ్బంది బయటికి పంపించారు. తాను ఇంటికి వెళ్తున్నానని చెప్పిన ప్రశాంత్ కొద్దిసేపటికే తన అనుచరులతో కలిసి ఓపెన్‌టాప్ జీప్‌పై మళ్లీ స్టూడియో వద్దకు వచ్చాడు. అప్పటికే ఆగ్రహంగా ఉన్న అమర్‌దీప్ అభిమానులు, ఇతర కంటెస్టెంట్ల అభిమానులు రాళ్లతో పరస్పర దాడులకు దిగారు. ఈ ఘటనలో రెండు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు లాఠీ చార్జ్ చేసి ప్రశాంత్‌ను అక్కడి నుంచి పంపారు. అప్పటికే పరిస్థితి అదుపుతప్పడంతో పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, సాయుధ బలగాలతో అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. ఎస్‌ఐ రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రశాంత్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రశాంత్‌ను అరెస్ట్ చేసేందుకు సన్నాహాలు చేపట్టారు.

బాధ్యతల స్వీకరణ

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా సి.సుదర్శన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన దానకిశోర్ నుంచి చార్జి తీసుకున్నారు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు–2002 బ్యాచ్‌కి చెందిన సుదర్శన్‌రెడ్డి పురపాలక, పట్టణాభివద్ధి శాఖ కార్యదర్శిగా పనిచేసి.. జలమండలికి బదిలీపై వచ్చారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాజస్థాన్‌లో జరుగుతున్న ఉప ఎన్నికకు పరిశీలకుడిగా వెళ్లారు. జనవరి 9న తిరిగి రానున్నారు. అప్పటి వరకు మరొకరికి అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి.

అదే ఒరబడి

అనుమతిలేని పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విద్యా సంవత్సరం ఆరంభంలోనే అడ్డుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇరుకు వీధుల్లో, చిన్న చిన్న భవనాల్లో బోర్డులు పెట్టి వీటిని నడిపిస్తున్నారు.



గుర్తింపు లేకుండా గుట్టుగా పాఠశాలల నిర్వహణ

- ఒకవైపు నిర్మాణాలు.. మరో వైపు తరగతులు
- కనీస భద్రత లేని భవనాల్లో ప్రైవేటు బడులు
- కనిపించని లైబ్రరీలు, ప్రయోగశాలలు, ఆట స్థలాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పలు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.కనీస రక్షణ, అనుమతి లేని భవనాల్లో గుట్టుగా తరగతులు నిర్వహిస్తున్నాయి. ఆయా విద్యా సంస్థలకు కనీస గుర్తింపు పొందకుండా రహస్యంగా అడ్మిషన్లు స్వీకరిస్తున్నాయి. శేరిలింగంపల్లి మండలం,అయ్యప్ప సొసైటీ, బాలాపూర్, సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల్లో ఈ తరహా విద్యాసంస్థలు ఎక్కువగా కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఒకే క్యాంపస్‌లో ఒక బ్లాక్‌కు గుర్తింపు పొంది.. అనధికారికంగా అదే ప్రాంగణంలో మరికొన్ని బ్లాకులు నిర్వహిస్తున్నాయి. వీటిలో ఏ ఒక్క భవనానికి కూడా జీహెచ్‌ఎంసీ, ఫైర్ సేఫ్టీ విభాగాల నుంచి ఎన్‌ఓసీ పత్రాలు జారీ కాలేదు. ఇటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు కోకొల్లలు.తల్లిదండ్రులు,విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేస్తే.. షోకాజు నోటీసులతోనే సరిపెడుతున్నారు.

7వరకు అనుమతి.. పది వరకు బోధన

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు 2,863 వరకు ఉన్నాయి. వీటిలో 1,319 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. అనధికారికంగా మరో 45 స్కూళ్ల వరకు ఉన్నట్లు అంచనా. ఈ ప్రైవేటు స్కూళ్లలో సుమారు 6.84 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మెజార్టీ స్కూళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిర్మాణ అనుమతులే కాదు అగ్నిమాపక వ్యవస్థ కూడా లేదు. మాదాపూర్, అయ్యప్ప సొసైటీల్లో ఈ తరహా భవనాలు ఎక్కువగా ఉన్నాయి. అయ్యప్ప సొసైటీలో ఏ ఒక్క భవనానికి జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి లేదు. కానీ అనుమతులు లేని ఈ భవనాల్లో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకం. ఇదిలా ఉంటే కొన్ని యాజమాన్యాలు ఒకటి నుంచి ఏడు వరకు అనుమతి తీసుకుని.. పదో తరగతి వరకు పాఠ్యాంశాలు బోధిస్తున్నాయి. తీరా వార్షిక పరీక్షల సమయంలో మరో ప్రాంతంలోని మరో స్కూలు పేరుతో హాల్ టికెట్లు జారీ చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు సైతనం యాజమాన్యంతో విభేదిస్తే పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తారేమో అనే భయంతో నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ధైర్యం చేసి అధికారులకు ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఐదంతస్తుల భవనాలు.. అడ్డగోలు అనుమతులు

‘ఎస్టాబ్లిష్‌మెంట్, రికగ్నైజేషన్ అడ్మిషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ స్కూలు అండర్ ప్రైవేటు మేనేజ్‌మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993’ ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. తరగతుల నిర్వహణకు అనుమతి ఇవ్వకూడదు. జిల్లా విద్యాశాఖ ఇవేమీ పట్టించుకోకుండా అడ్డగోలుగా అనుమతులు జారీ చేస్తోంది. హస్తినాపురం సౌత్ ప్రధాన రోడ్డులో పార్కింగ్ సదుపాయం లేని ఐదంతస్తుల నివాస భవనంలో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారనేది అంతుచిక్కడం లేదు. హస్తినాపురం డివిజన్ జెడ్పీరోడ్డులోని పలు నివాస భవనాల్లో కొత్తగా రెండు మూడు పాఠశాలలు కొనసాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బాలాపూర్ మండలం టీచర్స్ కాలనీలోని వినాయకహిల్స్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఆట స్థలంలో నాలుగు అంతస్తుల భవనం నిర్మించి, ఫైర్ సేఫ్టీ వంటి కనీస చర్యలు చేపట్టకుండా తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు ఇదే అంశంపై ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాత్కాలికంగా షోకాజ్ నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు ఆశపడి.. అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆయా స్కూళ్లలో కనీస పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు తమ సైకిళ్లను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా కాలనీల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆటస్థలాలు లేకపోవడంతో శరీరానికి వ్యాయామం లేకుండా పోతోంది. శారీరక, మానసిక వికాసం లేక మెజార్టీ పిల్లలు ఊబకాయం బారినపడాల్సి వస్తోంది. సైన్స్ ప్రయోగశాలలు మచ్చుకు కన్పించడం లేదు. తాగునీరు సైతం విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తోంది. మరుగు దొడ్లు, మూత్ర శాలలు కంపుకొడుతున్నాయి. పరోక్షంగా పిల్లల అనారోగ్యానికి కారణ మవుతున్నాయి.

తాజాగా నోటీసులు

తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు తాజాగా పలు గుర్తింపు లేని విద్యా సంస్థలకు జిల్లా విద్యాశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. బాలాపూర్ మండలం అల్మాస్‌గూడలోని భారతీయ విద్యాభవన్ సహా శేరిలింగంపల్లి మండలం చందానాయక్ తండా సిద్ధివినాయకనగర్‌లోని శ్రీచైతన్య స్కూలుకు, మాదాపూర్ అయ్యప్ప సొసైటీ, ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీలోని స్కూలుకు, సాయి హైటెక్ ప్లాజా సమీపంలోని ప్లాట్ నంబర్ 18లోని స్కూలుకు, మణికొండ జాగీరు షిరిడీ సాయినగర్, శివపురికాలనీలోని మరో స్కూలుకి, హస్తినాపురం సౌత్ వైపీ నిలయంలోని ఇషా స్కూల్‌కి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయా యాజమాన్యాలు విద్యాశాఖ నుంచి కనీస గుర్తింపు పొందకుండానే గుట్టుగా తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించాయి. అంతేకాదు ఆయా విద్యా సంస్థలు కొనసాగుతున్న భవనాలకు స్థానిక సంస్థలు, అగ్ని మాపకశాఖల నుంచి కనీస అనుమతులు లేవు.



అర్జీలు స్వీకరిస్తున్న, కలెక్టర్ హోళికేరి, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీత

‘ప్రజావాణి’కి ప్రాధాన్యత

- ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ భారతి హోళికేరి సూచన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భారతి హోళికేరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఖచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 176 ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రక్షాళన.. సుపరిపాలన



- హెచ్ఎండీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దానకిషోర్
- పరిపాలన వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు
- ఏళ్లుగా తిష్ట వేసిన అధికారులకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి దానకిషోర్ సోమవారం బాధ్యతలను చేపట్టారు. ప్రభుత్వం ఆయనను ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీగా నియమించడంతో పాటు హెచ్ఎండీఏ కమిషనర్‌గా కూడా పూర్తి స్థాయిలో అదనపు బాధ్యలను అప్పగించిన సంగతి తెలిసిందే. ఈమేరకు సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీగా బాధ్యతలను స్వీకరించడంతో పాటు, హెచ్ఎండీఏ కమిషనర్‌గా కూడా దానకిశోర్ బాధ్యతలను తీసుకున్నారు. అనంతరం హెచ్ఎండీఏలోని వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. జీహెచ్ఎంసీ, ఎంఏయూడీ విభాగాలకు చెందిన అధికారులు సైతం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్ని విభాగాలు అప్రమత్తం

మరోవైపు హెచ్ఎండీఏలో కొత్త బాస్ రాకతో అన్ని విభాగాలు అప్రమత్తమయ్యాయి. హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన హెచ్ఎండీఏను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు కొత్త ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏలో కొత్తగా జాయింట్ కమిషనర్ పోస్టును ఏర్పాటు చేసి ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి ఆ బాధ్యతలను అప్పగించిన రెండు రోజుల్లోనే కమిషనర్ నియామకంపైన దృష్టి సారించడం గమనార్హం. ఇప్పటి వరకు ఆ బాధ్యతలను నిర్వహించిన అర్వింద్‌కుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో దానకిషోర్‌కు బాధ్యతలను అప్పగించారు.

ఆదాయంలో కీలకం

భూముల అమ్మకం, భవన నిర్మాణాలకు అనుమతులు వంటి వివిధ రకాల కార్యకలాపాలతో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించిపెట్టడంతో పాటు, హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన హెచ్ఎండీఏను బలోపేతం చేసేందుకు సమూలమైన మార్పులు రానున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖను పర్యవేక్షిస్తున్న దృష్ట్యా హెచ్ఎండీఏను పరుగులు పెట్టించగలిగే అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం సన్నద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

పరిపాలన వ్యవస్థపై దృష్టి

హెచ్ఎండీఏలోని వివిధ విభాగాల్లో ఏళ్లగా పాతుకుపోయి తిష్ట వేసుకొని ఉన్న అధికారులు, ఉద్యోగులకు తప్పనిసరిగా స్థానచలనం ఉండే అవకాశం ఉంది. కొందరు అధికారులు ఉద్యోగ విరమణ అనంతరం కూడా వివిధ విభాగాల్లో ఉన్నత స్థాయిలో కొనసాగడం వల్ల అనేక మందికి పదోన్నతులు లభించడం లేదు. దీంతో వారు కొంతకాలంగా తీవ్రమైన నిరాశానిస్పృహల్లో ఉన్నారు. గత ప్రభుత్వం ఒకరిద్దరు అధికారులకే కీలకమైన బాధ్యతలను అప్పగించి మిగతా అధికారులను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో వారంతా అసంతృప్తితో ఉన్నారు. ఉద్యోగ విరమణ వరకు కూడా ఎలాంటి పదోన్నతులకు నోచక, అనేక సంవత్సరాలుగా ఒకే పోస్టులో పని చేస్తున్నవాళ్లు కొందరైతే, చాలా ఏళ్లుగా బదిలీల్లేక నచ్చని పోస్టుల్లో పని చేస్తున్నవాళ్లు మరి కొందరు ఉన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, ప్రణాళికా విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగుల్లో ఈ అసంతృప్తి ఉంది. నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ విభాగమే కీలకమైంది. ఇటీవల వరకు ఔటర్ రింగ్ రోడ్డు (లీజుకు ఇవ్వడానికి ముందు వరకు) నిర్వహణ, అర్బన్ ఫారెస్టుల అభివృద్ధి, ఫ్లై ఓవర్‌లు, స్కైవేలు, సైకిల్‌ట్రాక్‌ల అభివృద్ధి, పార్కుల నిర్మాణం వంటి ఎన్నో ప్రాజెక్టులను హెచ్ఎండీఏ ఇంజనీరింగ్ విభాగం చేపట్టింది. ఈ ప్రాజెక్టుల్లో కొందరు అధికారులు కొన్ని ప్రాజెక్టులలో కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కై ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇలాంటి అధికారులపైన చర్యలు తప్పకపోవచ్చుననే అభిప్రాయం వినిపిస్తోంది. మరోవైపు ప్రణాళికా విభాగంలోనూ కొందరు అధికారులు బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, హైరైజ్ బిల్డింగ్‌లకు అడ్డగోలుగా అనుమతులను ఇచ్చి పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వారిపైన బదిలీ వేటు పడనుందని అంటున్నారు.



‘జ్వాల’ క్రికెట్ అకాడమీ

భారత బ్యాడ్మింటన్ మాజీ ప్లేయర్, వరల్డ్ చాంపియన్‌షిప్ మెడలిస్ట్ గుత్తా జ్వాల ఇప్పుడు మహిళా క్రికెట్‌తో జత కట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జ్వాల బ్యాడ్మింటన్ అకాడమీ నడుపుతుండగా.. ఇప్పుడు క్రికెట్ అకాడమీని కూడా ఏర్పాటు చేయాలని ఆమె నిర్ణయించారు. ఇది పూర్తిగా బాలికలు, మహిళల కోసం మాత్రమే. మొయినాబాద్‌లో సుజాత స్కూల్ ఆవరణలోనే కొత్తగా ఈ క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం జరిగిన కార్యక్రమంలో జ్వాల ప్రకటించారు. తమ ప్రణాళిక ‘ఆఫ్టర్ స్కూల్ అకడమిక్ యాక్టివిటీ’లో భాగంగా కొత్త అకాడమీని సిద్ధం చేస్తున్నామని సుజాత స్కూల్ డైరెక్టర్ ఉదయ్ సింగ్ వెల్లడించారు.

– సాక్షి, హైదరాబాద్

పబ్‌లలో పోలీసుల సోదాలు

బంజారాహిల్స్: పబ్‌లలో డ్రగ్స్ గబ్బును వదిలించేందుకు పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట పోలీసులు తమ పరిధిలోని పలు పబ్‌ల లో స్నిఫర్ డాగ్‌లతో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు నడుం బిగించారు. ఫిలింనగర్ పీఎస్ పరిధిలో మూన్‌షైన్, బీబీసీ పబ్‌లలో సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. జూబ్లీ హిల్స్‌లోని 28 పబ్‌లలో ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ పి.రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎనిమిది బృందాలు రెండు గంటల పాటు ఈ సోదాలు జరిపాయి. నిర్వాహకులకు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా, ఆ మాట వినిపించినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. ఎక్కడైనా వినియోగిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

కేసులు కొట్టేస్తారా..?

గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటును తలపెట్టగా.. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించింది. దీంతో భూములు కోల్పోయిన రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- ఫార్మాసిటీ రద్దు ప్రకటనతో బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు
- కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన
- ప్రభుత్వనిర్ణయం కోసం రైతుల ఎదురుచూపులు

యాచారం: ఏటా మూడు పంటలు పండే పొలాల్లో ఫార్మాసిటీ ఏర్పాటును ఆది నుంచి స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. 2017లో కేసీఆర్ సర్కార్ ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల అసైన్డ్, పట్టాల భూములు సేకరించేందుకు నిర్ణయించిన విషయం విదితమే. భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించిన తర్వాత 2018లో మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ గ్రామాల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ సభను ఏర్పాటు చేశారు. ఈ సభను అడ్డుకునేందుకు యత్నించిన రైతులతోపాటుగా పలువురు రాజకీయ పక్షాలనేతలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. అనంతరం భూ సేకరణకు గ్రామాలకు వెళ్లిన అధికారులను రైతులు తీవ్రంగా ప్రతిఘటించడంతో పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టారు. నక్కర్తమేడిపల్లి పర్యటనకు వెళ్లిన(అప్పటి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే) మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వాహణ శ్రేణిపై ఫార్మాసిటీ వ్యతిరేకులు రాళ్ల దాడి చేశారు. మరోమారు నందివనపర్తి గ్రామంలో ఫార్మాసిటీ రోడ్డు వెడల్పు పనుల భూసేకరణ అడ్డుకున్నందుకు గాను అప్పటి ఆర్డీఓ వెంకటాచారి 25 మందికి పైగా స్థానిక రైతులపై, పలు రాజకీయ పక్షాల నేతలపై కేసులు పెట్టారు.

కోర్టుల చుట్టూ చక్కర్లు

ఫార్మాసిటీని అడ్డుకున్న రైతులను, స్థానికులను దాదాపు150 మంది రైతులు, పలు రాజకీయ పక్షాల నేతలు ప్రతీ నెల కోర్టుల చుట్టు తిరుగుతూనే ఉన్నారు. వారు కోర్టుల చుట్టూ తిరిగేందుకు.. లాయర్లకు ఫీజులు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కోర్టులకు వెళ్లే రైతులను ఉదహరిస్తూ.. ఫార్మాసిటీ ఆగదు.. మీరుఅడ్డుకుని కేసులపాలు కావద్దు.. పట్టా భూములు ఇవ్వండంటూ మిగిలిన రైతులను బెదిరించేవారు.

ముఖ్యమంత్రి ప్రకటనతో..

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించడం.. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడం, సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం.. వెనువెంటనే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించారు. దీంతో కేసుల పాలైన రైతుల్లో, రాజకీయ పక్షాల నేతల్లోనూ ఆశలు చిగురించాయి. ఫార్మాసిటీ రద్దు కోసం పోరాటాలు చేస్తే పోలీసులు మా పై అక్రమ కేసులు పెట్టారు. జైళ్లకు పంపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీనే రద్దు చేశాకా మా పై కేసులు ఎందుకు.. వెంటనే కొట్టేయండి అంటూ రైతులు ప్రాధేయపడుతున్నారు.



నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో పాతిన బోర్డు

రూ.లక్ష ఖర్చయింది



రెండేళ్ల క్రితం ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణం కోసం నందివనపర్తిలో అప్పటి ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి ప్రజాభిప్రాయ సేకరణ సభ ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీ వద్దు, రోడ్డు వెడల్పుకు పట్టా భూములిస్తామని చెప్పినందుకుగాను నాతో పాటు 20 మందిపై కేసులు పెట్టారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. నేటికి రూ.లక్ష వరకు ఖర్చు చేశా.

– కొండూరి రామనాథం, రైతు, నందివనపర్తి

జైళ్లకు పోయాం



ఫార్మాసిటీ వద్దని ఆందోళన చేస్తే నక్కర్తమేడిపల్లి గ్రామంలో 50 మందికి పైగా అక్రమ కేసులు పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ రద్దు చేస్తామని ప్రకటించారు. కేసుల పాలైన వారమంతా నిరుపేదలం. సీఎం ప్రకటనతో మా పై పెట్టిన కేసులు రద్దవుతాయనే ఆశ కలుగుతుంది. కేసులు కొట్టేస్తే ఆయనకు రుణపడి ఉంటాం.

– నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి, యాచారం

సీఎం దృష్టికి తీసుకెళ్తా



రైతులపై అప్పటి కేసీఆర్ సర్కార్ అక్రమ కేసులు పెట్టింది. నక్కర్తమేడిపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ సభకు వెళ్లకుండా తనను అరెస్టు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేస్తామని ప్రకటించారు. రైతులపై పెట్టిన కేసులను కొట్టేయాలని సీఎం కోరుతా. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకం ఉంది.

– ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

బాలిక అదృశ్యం



పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన అజిమన్ బీబీ కుమార్తె తాజో కాతూన్(16), ఈ నెల 16న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. స్థానికంగా ఉండే సూరజ్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ బాలిక తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఉపాధ్యాయులకు పీఆర్టీయూ అండ

శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాల అభివృద్ధితో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధిని మెరుగు పరిచేలా పీఆర్టీయూటీఎస్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి అన్నారు. వారం రోజుల క్రితం మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పటోళ్ల అనంతరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం వారి కుటుంబ సభ్యులను కలిసి ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సంఘం ఎల్లప్పుడు ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని చెప్పారు. అనంతరెడ్డికి సంఘంలో క్రియాశీల సభ్యత్వం ఉండటంతో లక్ష రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల శాఖ అధ్యక్షుడు బందయ్య, జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, కృష్ణారెడ్డి, సత్తయ్యగౌడ్, వినోద్, సుదర్శన్, కృష్ణ, హన్మంత్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రాములు, నరేందర్, నారాయణ, నరేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న సంఘం నాయకులు శ్రీపాల్‌రెడ్డి

మునగ సాగు.. లాభాలు బాగు



జి.శ్రీకృష్ణ, శాస్త్రవేత్త

కందుకూరు: మునగ పంట సాగుకు రాష్ట్రంలోని నేలలు అనుకూలం. ఆశించిన మేర దిగుబడులతో పాటు మంచి లాభాలు ఆర్జించవచ్చు. పంటసాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా క్రిడా శాస్త్రవేత్త జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

- నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు మట్టి నేలలు మునగ సాగుకు అనుకూలమైనవి. నీటి వసతి ఉండి సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు.
- తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన పీకేఎం1 రకం మునగ సాగుకు అనుకూలమైంది. ఇది నాటిన ఆరు నెలల్లో కాపునకు వచ్చి రెండు సంవత్సరాల్లో మూడు కాపులనిస్తుంది. కాయలు పొడవుగా మంచి కండ కలిగి ఉంటాయి.

మొక్కల పెంపకం

- సేకరించిన విత్తనాన్ని కిలోకు 2-3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెబ్‌తో విత్తన శుద్ధి చేయాలి. రెండు పాళ్ల మంచి ఎర్రమట్టి, ఒక పాలు ఇసుక, ఇక పాలు బాగా చివికిన పశువుల ఎరువు కలిపిన మిశ్రమాన్ని 4fi6 సైజులో కింద భాగంలో తగినన్నీ రంధ్రాలు గల 150 గేజ్ మందం గల పాలిథిన్ సంచుల్లో నింపాలి. పాలిథిన్ సంచుల్లో విత్తనాన్ని అంగుళం లోతులో విత్తాలి. ప్రతి రోజు నీరు పెట్టాలి. వర్షాకాలంలో పాదులో నేరుగా కూడా విత్తనాన్ని పెట్టవచ్చు. నాటిన 10-12 రోజుల్లో విత్తనం మొలకెత్తుతుంది. ఎకరాకు 300 గ్రాముల విత్తనం సరిపోతుంది. పాలిథిన్ సంచుల్లో విత్తిన 40 రోజుల్లో మొక్కలు తోటలో నాటడానికి సిద్ధమవుతాయి.

నాటడం

- పొలాన్ని దున్ని కలుపు లేకుండా శుభ్రం చేయాలి. 2.5fi2.5 మీటర్ల దూరంలో అడుగులోతు, అడుగు వెడల్పుతో గుంతలు తవ్విన మట్టిని భూసారాన్ని బట్టి 5-10 కిలోల మాగిన పశువుల ఎరువు, 200 గ్రాముల సూపర్, 25 గ్రాముల 4 శాతం ఎండోసల్ఫాన్ పొడి మందు కలిపి గుంతలు పూడ్చి అందులో మొక్కలను నాటి నీరు పెట్టాలి.

నీరు కట్టడం

- మొక్క పెరిగే దశలో 8-10 రోజులకొకసారి, పూత, కాయదశలో 6-7 రోజులకొకసారి అవసరాన్ని బట్టి నీటి తడి ఇవ్వాలి. డ్రిప్పు ద్వారా రోజు విడిచి రోజు 10-15 లీటర్ల నీరు ఇవ్వాలి.



మునగ తోట

ఎరువులు

- పిందె పడిన దగ్గర నుంచి 25-30 రోజులకొకసారి చెట్టుకి 75-100 గ్రాముల 17:17:17 ఎరువును వేయాలి. దీంతో కాయ పరిమాణం పెరుగుతుంది.

సస్యరక్షణ

- పూతదశలో చీడపట్టకుండా 10 లీటర్ల నీటికి 20 మి.లీ రోగార్, 2 గ్రాముల మాంకోజెబ్, 2 మి.లీ ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. పిందె దశలో ఫ్రూట్‌ఫ్లై ఆశించకుండా 2 మి.లీ మలాథియాన్ మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. ఈగ ఆశించి నల్లబడిన పిందెలను, కాయలను ఎప్పటికప్పుడు తొలగించాలి.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 15,16 డివిజన్‌ల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ విచ్చేసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్లను నాణ్యతతో మన్నికగా వేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదార్లను కోరారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌ల్లో మిగిలిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మనోహర్, నాయకులు ఎర్ర జైహింద్, ఏఈఈ వినీల్‌గౌడ్, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

తెలుగు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కాంచన లత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కమిషనర్ కళాశాల విద్యాశాఖ నుంచి తెలుగు అధ్యాపకుల నియామకానికి అనుమతి ఉత్తర్వులు వెలువడినట్లు చెప్పారు. అభ్యర్థులు తెలుగు సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అలాగే ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, సెట్, పీహెచ్‌డీ, బోధనలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

నోటీసులు జారీ

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: మున్సిపాలిటీలోని రావిర్యాల పరిధిలో ఉన్న కాంక్రీట్ మిక్స్‌డ్ (ఆర్ఎంసీ) కేంద్రాల నుంచి కంకర, డస్టు రాకుండా తగ్గు నివారణ చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'రోడ్డుపై కంకర... ఆదమరిస్తే అంతే' ! అనే శీర్షికకు ఆయన స్పందించారు. రోడ్డును సిబ్బంది చేత శుభ్రం చేయించి, దుమ్ము లేవకుండా నీరు పోయించారు.



శుభ్రమైన కలెక్టర్ కార్యాలయ రోడ్డు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చేవెళ్ల: మండలకేంద్రంలో అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సోమవారం సాయంత్రం చేవెళ్లలో వేంకటేశ్వరస్వామి ఆలయం, పోలీస్ క్వార్టర్స్‌కు మధ్యలో ఉన్న వేపచెట్టు కింది స్థానికులు ఓ వ్యక్తి చనిపోయి ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి కింద కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే చేవెళ్ల పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వీరబ్రహ్మం కోరారు.



మృతదేహం

తెలుగుబుక్ ఆఫ్ రికార్డులో విష్ణువర్ధన్‌కు చోటు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామానికి చెందిన జంగిలి విష్ణువర్ధన్‌కు చోటు దక్కింది. మయూరి ఆర్ట్స్ ఫిల్మ్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ వారి సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల భారతి విద్యాభవన్‌లో మయూరి ఆర్ట్స్ టాలెంట్ ఆఫ్‌ది ఇయర్ 2023లో భాగంగా 290 మంది 90 నిమిషాలు 19 గ్రూప్‌లు 19 కేటగిరిల్లో కప్పపహాడ్ నివాసి జంగిలి విష్ణువర్ధన్ అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. ఆయన ఆలపించిన సంకీర్తనలు ప్రేక్షకులను ఎంతోగానో ఆకట్టుకున్నాయి. తన సంగీత గురువు అన్నమయ్య కళాసమితి గండేపల్లి సుమలత సారథ్యంలో విష్ణువర్ధన్ తన పాటలను పాడారు. దారళంగా, నిర్విరామంగా అన్నమయ్య సంకీర్తనలు శ్రోతలకు వినిపించడంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో విష్ణువర్ధన్‌కు చోటు దక్కింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డుతో పాటు వండర్ బుక్, జై ఇండియన్, తెలుగు బుక్, ఇండియా బుక్, జీనియస్ బుక్, కోహినూర్ , గోల్డెన్ స్టార్, స్టేట్స్ బుక్స్, డైమండ్ రికార్డ్స్‌ల్లో స్థానం దక్కింది. గొప్ప పేరు తెచ్చుకోవడం పట్ల కప్పపహాడ్ గ్రామస్తులు విష్ణువర్ధన్‌ను ప్రసంశిస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్

పేద ప్రజలకు అండగా ఉంటాం

ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన దొరగంటి జంగయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని, స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఆయన పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కాలనీకి చెందిన తాహేరా బేగం ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు సాయం అందించారు. అలాగే, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 3 వ వార్డుకు చెందిన ముత్తి అంజయ్యను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడికి రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కోఆప్షన్ జహంగీర్‌బాబా, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, వార్డు సభ్యులు రాంచందర్, శ్రీను, మల్లయ్య, భిక్షపతి, నాయకులు జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, సత్యంయాదవ్, లక్ష్మయ్య, మహేశ్, ఇమ్రాన్, శ్రీకాంత్, రామకృష్ణ, రమేశ్, శ్రీను, మధు, సాయి, విజేందర్ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన ఉంటుందన్నారు. సోమవారం ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కెఎల్ఐ డీ82 కాలువ పనులను పూర్తి చేసి అన్ని మండలాలకు సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని వివరించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రారంభమైందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ధనయ్యగౌడ్, నాయకులు చంద్రయ్యగౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, ధనయ్య, శ్రీను, మహేశ్, యాదయ్య, ఆమనగల్లు మాజీ వార్డు సభ్యులు సత్యం, నాయకులు తిరుపతయ్య, సురేశ్‌గౌడ్, శ్రీనివాసులు, పాండుగౌడ్, వెంకటేశ్, నర్సింహా, నరేందర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తెల్లరేషన్ దారులకే ఉచిత ప్రయాణం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెల్లరేషన్ కార్డు దారులకే ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోలీకేరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. ధనవంతులైన మహిళలకు ఉచిత ప్రయాణాన్ని నియంత్రించాలన్నారు. నెలకు లక్షా రూపాయలు సంపాదించే మహిళా ఉద్యోగులకు ఉచిత ప్రయాణం తగదన్నారు. దీని వల్ల ఆర్టీసీకి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడకుండా చూడాలన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణం సవరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు తులసిగారి శేఖర్, అమర్, ,చెన్నయ్య, రాకేష్, నర్సింహా ,రవీందర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాసం షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి షోరూం ప్రారంభిస్తున్న రష్మిగౌతమ్

శంకర్‌పల్లిలో సందడి చేసిన రష్మి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో ప్రముఖ వస్త్ర షోరూం అయిన కాసం ఫ్యాషన్స్ రెడీమేడ్ షోరూంను సినీ నటి, యాంకర్ రేష్మిగౌతమ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేష్మిగౌతమ్ మాట్లాడుతూ.. షోరూంలో అన్ని వయస్సుల వారికి నాణ్యతతో కూడిన రెడీమేడ్ వస్త్రాలతో పాటు మహిళలకు సరసమైన ధరలకే చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. కాసం సంస్థల చైర్మన్ కాసం నమశివాయ మాట్లాడుతూ.. తమ సంస్థ వరంగల్‌లో మొదటి స్టోర్‌ను ప్రారంభించామని అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ప్రాంతాల్లో కూడా తమ స్టోర్స్ ఓపెన్ చేశామని తెలిపారు. రష్మిని చూసేందుకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో షాపింగ్ మాల్ వద్దకు చేరుకున్నారు. సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. కార్యక్రమంలో కాసం మల్లికార్జున్, కాసం నమశివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ వాణి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 32.13 లక్షలతో అభివృద్ధి పనులు

రాజేంద్రనగర్: ప్రజల ఆరోగ్యం కోసం డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి గ్రామం శాంతినగర్‌లో సోమవారం రూ.32.13 లక్షలతో డ్రైనేజీ పనులను కార్పొరేటర్ అర్చనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎక్కడైతే మురుగు సమస్య ఉందో అక్కడ తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మురుగు రోడ్లపై వెళ్లకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్, సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి, అనుముల జాన్‌పాల్, సీహెచ్.శ్రీవర్ధన్‌రెడ్డి, రగడంపల్లి శ్రావణ్‌కుమార్, కొరని రవీందర్, దేవదాస్, పట్నం నరేష్, జబీన్ హుస్సేన్, మోహన్‌రెడ్డి, పెంజర్ల మోహన్, గిరిబాబు, అరింట్ల విశాల్, వడ్డకొండ సురేష్, మహేశ్, ఆదిరాల అరుణ్‌బాబు, చిన్న, సంతోష్, ఇందిర, జయమ్మ పాల్గొన్నారు.